RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సోమవారం 7-9-2026 | సంచిక: 13 | సంఖ్య: 340 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
• పత్రికారంగంలో ఆసక్తి కలిగి ఉండాలి.
• తెలుగు భాషపై పట్టు ఉండాలి.
• రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
• స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
• సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
• అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386



## అసెంబ్లీ వేదికగా పొలిటికల్ ఫైట్..

**నేటి నుంచి వర్షాకాల సమావేశాలు.. కీలక చర్చలకు అసెంబ్లీ రెడీ**

- నేటి నుంచి ప్రారంభం కానున్న శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు
- ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలపై సభలో హోరాహోరీ చర్చకు అవకాశం
- అధికార, విపక్షాల అంశాలతో సమావేశాలపై రాజకీయ ఉత్కంఠ
- భద్రతతోపాటు శాఖల సమన్వయంపై ఉన్నతాధికారుల ప్రత్యేక దృష్టి

ప్రజా సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ అసెంబ్లీ వేదిక సిద్ధమైంది. శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు నేడు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభా నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

2లో



## కాంగ్రెస్ సర్కార్‌పై పోరుకు కేసీఆర్ కొత్త వ్యూహం..


- రాష్ట్రవ్యాప్త పర్యటనకు గులాబీ బాస్ సిద్ధం
- అసెంబ్లీ బీఏసీలో 15--20 రోజుల సమావేశాలకు పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ప్రజా సమస్యలతో పాటు సాగునీరు, కాళేశ్వరం, పాలమూరు అంశాలపై పోరాటానికి కార్యాచరణ
- రాష్ట్రంలో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్న కేసీఆర్

హైదరాబాద్: అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడంతో పాటు, ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్యాచరణ సిద్ధం చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్న

2లో

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం



## తెలంగాణకు మరో టెక్ బిగ్ ప్లాన్..

- సారస్వత్‌తో శ్రీధర్‌బాబు కీలక చర్చలు
- సిలికాన్ ఫోటోనిక్స్ రంగంలో రాష్ట్రానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రానికి సారస్వత్‌ను ఆహ్వానించిన మంత్రి
- డిజైన్ నుంచి తయారీ, ప్యాకేజింగ్, పరీక్షల వరకు సమగ్ర వ్యవస్థపై దృష్టి



హైదరాబాద్: అత్యాధునిక సాంకేతిక రంగాల్లో తెలంగాణను దేశంలో ముందువరుసలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సిలికాన్ ఫోటోనిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలను

## భోగాపురంలో దారుణం

- డబ్బులివ్వలేదని యువకుడికి తాళ్లు కట్టి, బైక్‌తో లాక్కెళ్లిన మెకానిక్
- బైక్ రిపేర్ డబ్బుల కోసం యువకుడిపై దారుణ దాడి
- మెడకు, చేతులకు తాళ్లు కట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లిన మెకానిక్
- విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన అమానుష ఘటన
- ప్రధాన నిందితుడు మహేశ్‌తో పాటు ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



2లో

## త్వరలో వైఎస్ షర్మిల కుమార్తె అంజలి వివాహం..



2లో

- వైఎస్ షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహం నిశ్చయం
- అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తున్న రఘురామరెడ్డితో పెళ్లి
- వరుడి కుటుంబం కర్నూలు జిల్లాకు చెందిన వారు
- సోషల్ మీడియా వేదికగా శుభవార్తను ప్రకటించిన షర్మిల



## విజయవాడ హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం

- భవనం పైఅంతస్తులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ
- భారీగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా

విజయవాడ నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది.

2లో

## కొడంగల్ కేంద్రంగా కవిత కొత్త వ్యూహం..

- 23న భారీ సభకు సన్నాహాలు
- కోస్గిలో 'పాంచజన్య సంకల్ప సభ' నిర్వహణకు తెలంగాణ రక్షణ సేన నిర్ణయం
- కాంగ్రెస్ హామీల అమలుపై కవిత తీవ్ర విమర్శలు
- ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ..
- పార్టీలో చేరిన బీజేపీ నేత ప్రభాకర్ కులకర్ణి



2లో

హైదరాబాద్: కొడంగల్ నియోజకవర్గాన్ని రాజకీయ కార్యాచరణకు కేంద్రంగా మార్చుకునే దిశగా తెలంగాణ రక్షణ సేన ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఈ నెల 23న కోస్గిలో 'పాంచజన్య సంకల్ప సభ' నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధినేత కవిత ప్రకటించారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు



## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

- వాళ్లంతా బయటకొచ్చారు: ప్రధాని మోదీ
- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# తెలంగాణకు మరో టెక్ బిగ్ ప్లాన్..

రాష్ట్రంలో మరింత విస్తరించే అంశంపై మంత్రి శ్రీధర్‌బాబు, నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్ మధ్య కీలక చర్చ జరిగింది. ఆదివారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణలో మౌలిక వ్యవస్థను అభివృద్ధి చేసే అంశాలపై సమాలోచనలు సాగాయి. తెలంగాణలో సిలికాన్ ఫోటోనిక్స్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇండియా సెమీకండక్టర్ మిషన్--2.0తో రాష్ట్ర ప్రణాళికను అనుసంధానించే అవకాశాలపైనా చర్చించారు. పరిశోధన దశలోనే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తులుగా మార్చే స్థాయి వరకు వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యాన్ని శ్రీధర్‌బాబు వెల్లడించారు. చిప్ డిజైన్, పరిశోధన, ఉత్పత్తి, ప్యాకేజింగ్, నాణ్యత పరీక్షలకు సంబంధించిన విభాగాలను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడంపై రాష్ట్రం దృష్టి పెట్టినట్లు తెలిపారు. అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్‌తో పాటు కో-ప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలోనూ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇందుకోసం ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు డా. వీకే సారస్వత్ సహకారం అందించాలని కోరారు. అలాగే ఫోటోనిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన అడ్వైజరీ కౌన్సిల్‌కు నాయకత్వం వహించాలని ఆయనను శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డా. వీకే సారస్వత్ ఈ సందర్భంగా వెల్లడించినట్లు మంత్రి తెలిపారు. దీంతో రాష్ట్రంలో సెమీకండక్టర్లు, ఫోటోనిక్స్, క్వాంటమ్ టెక్నాలజీలకు అనుకూలమైన పరిశోధన, పరిశ్రమల వాతావరణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

### విజయవాడ హ్యుందాయ్ కార్ల షోరూంలో

# భారీ అగ్నిప్రమాదం

ఆదివారం నాడు షోరూంకు సెలవు కాగా, ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. భవనం పైఅంతస్తు నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని హ్యుందాయ్ షోరూం భవనం పైభాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భవనం పైఅంతస్తును పూర్తిగా చుట్టుముట్టాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడంతో సమీప నివాసితులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఆదివారం సెలవు కావడంతో షోరూంలో సిబ్బంది గానీ, వినియోగదారులు గానీ ఎవరూ లేరు. ఇదే రోజు పనిదినం అయ్యుంటే ఊహించని స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు అభిప్రాయపడ్డారు. భవనం పైఅంతస్తులో సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేయనున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై పోరుకు కేసీఆర్ కొత్త వ్యూహం..

ఆయన.. సాగునీటి సమస్యలు, ప్రభుత్వ పనితీరు తదితర అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అవసరమైతే పాదయాత్ర చేపట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీలో అసెంబ్లీ, మండలి సమావేశాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. సభా కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులంతా హాజరై, చర్చ జరిగే ప్రతి అంశంలో చురుగ్గా పాల్గొనాలని స్పష్టం చేశారు. సమావేశాలను నిర్లక్ష్యంగా తీసుకోవద్దని సూచించారు. శాసనసభా వ్యవహారాల కమిటీ భేటీలో సమావేశాల వ్యవధిని పెంచేలా పట్టుబట్టాలని పార్టీ నేతలకు సూచించారు. 15 నుంచి 20 రోజులపాటు సభ కొనసాగేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. స్పీకర్ వ్యవహారశైలిపైనా పార్టీ శాసనసభాపక్షంలో చర్చించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని కేసీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో ప్రజలు ప్రభావితమయ్యారని, ఇప్పుడు వాస్తవ పరిస్థితులు వారికి అర్థమవుతున్నాయని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ.. దాని పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. నదీ జలాల వాటా విషయంలో రాజీ ప్రసక్తే లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశంపై పెద్దఎత్తున ఉద్యమించాల్సి ఉంటుందని పార్టీ శ్రేణులకు సూచించారు. పాలమూరు--రంగారెడ్డి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలతో పాటు సాగునీటి సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని చెప్పారు. లక్ష మందితో ఆందోళన చేపట్టే ఆలోచన ఉందని, అవసరమైతే తానే దానికి నాయకత్వం వహిస్తానని తెలిపారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో పాటు క్షేత్రస్థాయిలోనూ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు.

# భోగాపురంలో దారుణం

జిల్లాలోని భోగాపురంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. చిన్నపాటి నగదు బాకీ కోసం ఓ యువకుడి మెడకు, చేతులకు తాళ్లు కట్టి, నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన దారుణం స్థానికంగా కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో తీవ్రంగా స్పందించిన పోలీసులు, ఈ ఘటనకు పాల్పడిన ప్రధాన నిందితుడు మహేశ్‌తో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేసి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, రామచంద్రరాజుపేటకు చెందిన రాజేశ్ అనే యువకుడు, భోగాపురంలోని మహేశ్ అనే మెకానిక్ వద్ద ఓ బైక్‌ను ట్రయల్ రన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ కారును ఢీకొట్టాడు. దానికి అయిన మరమ్మతుల ఖర్చును మహేశ్ సోదరుడు చెల్లించగా, ఆ డబ్బును రాజేశ్ తిరిగి ఇవ్వడంలో ఆలస్యం చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మహేశ్, తన స్నేహితులతో కలిసి రాజేశ్ ను అడ్డగించి, బలవంతంగా ఓ మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా అక్కడే నిర్బంధించి, చితకబాది, రూ. 30,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా, ఆదివారం ఉదయం రాజేశ్ చొక్కా విప్పించి, చేతులకు, మెడకు తాళ్లు బిగించి భోగాపురం వీధుల్లో బైక్‌కు కట్టి ఈడ్చుకెళ్లారు. ఈ అమానుష దృశ్యాన్ని చూసి చలించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హుటాహుటిన భోగాపురం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గంటల వ్యవధిలోనే నిందితులు ఐదుగురినీ అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. నిందితులపై హత్యాయత్నం (అటెంప్ట్ మర్డర్), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# కొడంగల్ కేంద్రంగా కవిత కొత్త వ్యూహం..



ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల్లో సగం కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తామని కవిత హామీ ఇచ్చారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ 'బహుజన తెలంగాణ' నిర్మాణమే తమ రాజకీయ లక్ష్యమని వెల్లడించారు. ఇదిలా ఉండగా, బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసిన ప్రభాకర్ కులకర్ణి తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఆయనతో పాటు వచ్చిన అనుచరులకు కవిత పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కులకర్ణి మాట్లాడుతూ కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ కోసం పనిచేస్తానని తెలిపారు. కొడంగల్ కేంద్రంగా నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభ ద్వారా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలంగాణ రక్షణ సేన వర్గాలు తెలిపాయి.

# అసెంబ్లీ వేదికగా పొలిటికల్ ఫైట్..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, సెప్టెంబర్: సభ్యులు ప్రస్తావించే అంశాలకు సంబంధించిన వివరాలు వెంటనే అందేలా వివిధ ప్రభుత్వ శాఖల ముఖ్య అధికారులను అసెంబ్లీ ప్రాంగణంలో అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. సమావేశాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శాసనసభ ప్రాంగణంలో ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. శాసమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ప్రభుత్వ విభాగాలతో పాటు పోలీస్, ఇంటెలిజెన్స్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభా కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చర్చించారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సమావేశాలు విజయవంతంగా



కొనసాగేలా అన్ని శాఖల నుంచి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సభ్యులు లేవనెత్తే ప్రశ్నలు, అంశాలకు సంబంధించి అధికారుల నుంచి అవసరమైన సమాచారం సకాలంలో అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సభా కార్యక్రమాల నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం కీలకమని స్పష్టం చేశారు. మరోవైపు సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను కూడా అధికారులు పరిశీలించారు. సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి పోలీస్, ఇంటెలిజెన్స్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాలు పరస్పర సహకారంతో పని చేస్తూ ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వ తీర్మానాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రధాన ప్రతిపక్షం ప్రస్తావించే అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. దీంతో సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే అంశాలపై సభలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్న దానిపై ఆసక్తి నెలకొంది. సభా వ్యవహారాలు సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పరిపాలనా సమన్వయంతో పాటు భద్రతా ఏర్పాట్లను కూడా పటిష్ఠం చేసింది.

# త్వరలో వైఎస్ షర్మిల కుమార్తె అంజలి వివాహం..

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట త్వరలోనే పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆమె కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం నిశ్చయమైంది. ఈ శుభవార్తను షర్మిల స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు. తన కుమార్తె అంజలితో పాటు కాబోయే అల్లుడు డాక్టర్ రఘురామరెడ్డి ఫోటోను షేర్ చేస్తూ, ఈ ఆనందకరమైన విషయాన్ని వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన సోమల సుబ్బారెడ్డి, పద్మారెడ్డి దంపతుల కుమారుడు డాక్టర్ రఘురామరెడ్డితో అంజలి వివాహం జరగనుంది. వరుడి కుటుంబం అమెరికాలో స్థిరపడిందని, వారంతా అమెరికా పౌరులని షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. "నా భర్త అనిల్ కుమార్, నేను దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, మా కుమార్తె అంజలి రెడ్డి వివాహం డాక్టర్ రఘురామ్ రెడ్డితో నిశ్చయమైన శుభవార్తను మీతో పంచుకుంటున్నాము. ఈ శుభ సందర్భంలో స్నేహితులు, శ్రేయోభిలాషులందరి ప్రార్థనలు, ఆశీస్సులు మా కుటుంబానికి అందించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాం" అని ఆమె పేర్కొన్నారు. కాబోయే వధూవరులిద్దరూ అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించి, అక్కడే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వైఎస్ అంజలి రెడ్డి బీబీఏ పూర్తి చేసి, ప్రస్తుతం ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. కాబోయే వరుడు రఘురామరెడ్డి యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో మెడిసిన్ చదివి, ప్రస్తుతం టెన్నెస్సీలోని నాష్‌విల్‌లో డాక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. వైఎస్ షర్మిలకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఆమె కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహం అట్లూరి ప్రియతో జోధ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. అప్పుడు షర్మిల స్వయంగా తాడేపల్లికి వెళ్లి తన అన్న, సీఎం జగన్‌ను పెళ్లికి ఆహ్వానించారు. అయితే, రాజారెడ్డి నిశ్చితార్థానికి హాజరైన జగన్, పెళ్లికి మాత్రం దూరంగా ఉన్నారు. ఇప్పుడు కుమార్తె వివాహంతో షర్మిల ఇంట మరోసారి పెళ్లి సందడి నెలకొంది.

# ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు.

# గజ్వేల్ గళం అసెంబ్లీలో వినిపించాలి..

### కేసీఆర్‌కు రఘునందన్‌రావు పిలుపు

**22ఏ జాబితాలో పేదల భూముల అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ ఎంపీ**

**దాదాపు రూ.లక్ష కోట్ల విలువైన భూముల వ్యవహారంపై సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్**

**రాబోయే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరై గజ్వేల్ ప్రజల తరపున మాట్లాడాలని సూచన**



**సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** గజ్వేల్ ప్రజల భూ సమస్యపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా శాసనసభలో స్పందించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించడం ద్వారా వారికి మరింత భరోసా కల్పించవచ్చని సూచించారు. ఈ మేరకు ఆదివారం గజ్వేల్ పట్టణంలో పర్యటించిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు, దళితులు, గిరిజనులకు చెందిన భూములను 22ఏ పరిధిలోకి చేర్చడంపై రఘునందన్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ పేదల భూములను ఈ విధంగా పరిమితుల్లోకి తీసుకురాలేదని వ్యాఖ్యానించారు. ఇందిరా గాంధీ హయాంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.లక్ష కోట్ల విలువైన పేదల భూములకు సంబంధించిన వ్యవహారం పెద్ద వివాదంగా మారిందని రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ భూముల విషయంలో భారీ స్థాయిలో అక్రమాలకు అవకాశం కల్పించారని విమర్శించారు. భూముల వ్యవహారంలో ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న మంత్రులు ఎవరనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ మొత్తం వ్యవహారంలో డబ్బులు ఎవరి వద్దకు వెళ్తున్నాయన్న దానిపై సీఎం సమాధానం చెప్పాలని ఆయన పట్టుబట్టారు. ప్రభుత్వం వెంటనే 22ఏ పరిధిలోకి తీసుకొచ్చిన పేదల భూములపై పునరాలోచన చేయాలని కోరారు. తరతరాలుగా కుటుంబాలకు చెందిన ఆస్తులపై ఆంక్షలు విధించడం వల్ల సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ రాబోయే శాసనసభ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని రఘునందన్‌రావు సూచించారు. గజ్వేల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ముఖ్యమంత్రి సభకు వచ్చి అక్కడి ప్రజల భూ సమస్యలను స్వయంగా ప్రస్తావిస్తే నియోజకవర్గ ప్రజలకు గౌరవంగా ఉంటుందని పేర్కొన్నారు.

# మియాపూర్‌లో కొత్త చరిత్ర..

**దక్షిణ భారతదేశంలో తొలి అహింసా స్తూపం ఆవిష్కరణ**

**అహింసా మార్గమే విశ్వశాంతికి బాట.. మియాపూర్‌లో ప్రత్యేక స్తూపం ఆవిష్కరణ**

**భగవాన్ మహావీరుడి శాంతి సందేశాలకు ప్రతీకగా అహింసా స్తూపం**

**దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు**

**అహింసా స్తూపాన్ని ఆవిష్కరించిన కిషన్‌రెడ్డి, హాజరైన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అరెకపూడి గాంధీ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** భగవాన్ మహావీరుడు బోధించిన అహింస, సహజీవనం, శాంతి సిద్ధాంతాలను ప్రజలకు గుర్తుచేసే మరో ప్రత్యేక నిర్మాణం హైదరాబాద్‌లో కొలువుదీరింది. మియాపూర్ వైశాలి నగర్‌లో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన 'అహింసా స్తూపం'ను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. మంజీర పైప్‌లైన్ రోడ్డులో జైన్ మహిళా పరిషద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో శాంతి, పరస్పర గౌరవం, సహజీవన భావనలను పెంపొందించేందుకు మహావీరుడి బోధనలు ఎంతో ప్రాధాన్యమున్నవని పేర్కొన్నారు. 'అహింసా పరమో ధర్మః', 'జీవించు--జీవించనివ్వు' అనే సందేశాలకు ఈ స్తూపం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దక్షిణ భారతదేశంలో ఇలాంటి తొలి అహింసా స్తూపం భాగ్యనగరంలో ఏర్పాటు కావడం సంతోషకరమని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. మహావీరుడి విశ్వశాంతి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ నిర్మాణం నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. జైన మత పెద్దలు, సమాజ ప్రతినిధులు, నిర్వాహకులు, ట్రస్టీలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అసెంబ్లీపై బీజేపీ వ్యూహం ఏంటి..?

### 15 రోజులు సభ జరపాల్సిందే.. రేవంత్ సర్కార్‌పై ఒత్తిడి

**అసెంబ్లీ సమావేశాల వేళ పొలిటికల్ హీట్.. ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన బీజేపీ**

**అసెంబ్లీపై బీజేపీ బిగ్ డిమాండ్.. రేవంత్ సర్కార్‌కు మహేశ్వర్‌రెడ్డి సవాల్**

**సభను సుదీర్ఘంగా నిర్వహించేందుకు ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని బీజేపీ ఆరోపణ**

**హామీల అమలు, ఉద్యోగుల బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న నేతలు**

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనతోపాటు అవినీతి అంశాలనూ సభలో ప్రస్తావిస్తామని వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** తెలంగాణ శాసనసభ నేటి నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బీజేపీ తన వ్యూహాన్ని ఖరారు చేసింది. సభను కేవలం పరిమిత కాలానికే కుదించకుండా 15 రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేయాలని నిర్ణయించినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై చర్చ జరిగితే కాంగ్రెస్ సర్కార్ ఇబ్బందుల్లో పడుతుందనే ఉద్దేశంతోనే సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించేందుకు వెనుకంజ వేస్తోందని ఆయన ఆరోపించారు.

అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన అంశాలపై ఆదివారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశమైంది. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ భేటీలో సభలో అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై రాజకీయంగా, విధానపరంగా ఒత్తిడి పెంచాలని నిర్ణయించినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలులో జాప్యాన్ని ప్రధానంగా ప్రశ్నించనున్నట్లు



చెప్పారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలను సభలో లేవనెత్తుతామన్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై కూడా వివరణ కోరుతామని స్పష్టం చేశారు. వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

ఇదే సమయంలో బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ కూడా కాంగ్రెస్ పాలనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటలకు, ప్రస్తుత పాలనలో జరుగుతున్న పరిణామాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అసెంబ్లీ వేదికగా ఎత్తి చూపుతామని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు సంధిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 1000 రోజుల పాలనలో తీసుకున్న నిర్ణయాలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అనంతరం ప్రకటించిన వాగ్దానాలను సభలో ప్రస్తావిస్తామని పాయల్ శంకర్ చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ఈహెచ్‌ఎస్ అమలులో అలసత్వం వద్దు..

**ఉద్యోగుల ఆరోగ్యమే తొలి ప్రాధాన్యం: భట్టి**

**హెల్త్ కార్డుల జారీని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**ఉద్యోగ సంఘాలతో చర్చల అనంతరం ఈహెచ్‌ఎస్ విధివిధానాల ఖరారు**

**354 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇప్పటికే వైద్య సేవలు.. మరిన్ని ఆస్పత్రుల చేరిక**



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఆధారపడిన వారి వైద్య భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వబోమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ప్రయోజనాలు సకాలంలో అందేలా ఈహెచ్‌ఎస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో ఈహెచ్‌ఎస్ అమలుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి పేర్కొన్నారు. ఈ పథకాన్ని నిర్లక్ష్యంగా పరిగణించకుండా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఈహెచ్‌ఎస్ సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి తెలిపారు. ఉద్యోగులు వైద్యం కోసం ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడకుండా ఆరోగ్య భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించిన నిబంధనలు, కార్యాచరణ విధానాలను ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 354 ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా ఈహెచ్‌ఎస్ సేవలు అందుతున్నాయని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని ఆస్పత్రులను 'డీమ్డ్ ఎంప్యానెల్డ్' విధానంలో సేవల పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించాలని భట్టి అధికారులను ఆదేశించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య రక్షణతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# పద్మశాలి యువజన సంఘం నూతన అధ్యక్షులుగా సూరపల్లి గణేష్ నేత

**యాదాద్రి భువనగిరి:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం పద్మశాలి యువజన సంఘం నూతన అధ్యక్షులుగా సురపల్లి గణేష్ నేత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి యువజన సంఘం అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు పద్మశాలి కుల బాంధవులకు ఆయన శక్తివంతున కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి రాజకీయ విభాగం అధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి బొల్లా శివశంకర్,బిజెపి నాయకులు వంగర రఘు,చేనేత సహకార సంఘం డైరెక్టర్ దువ్వ విజయలక్ష్మి అంజయ్య,వార్డ్ నెంబర్ సురపల్లి వెంకటేష్ గర్దాస్ రాఘవేంద్ర,,విడం సాయి కిషోర్ నేత,సింగం కృష్ణ, దువ్వ నవీన్,తదితరులు,పాల్గొన్నారు.

# పోలీసుల తీరుపై పువ్వాడ ఫైర్..

### "అధికారం మారితే లెక్క తేలుస్తాం"!

**కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లతో బీఆర్ఎస్ శ్రేణులపై కేసులు పెట్టొద్దని హితవు**

**చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే అధికారుల వివరాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడి**

**రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా**



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. అధికార పార్టీ నాయకుల ప్రాబల్యంతో ప్రతిపక్ష కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టపరమైన నిబంధనలను పక్కనపెట్టి వ్యవహరించే పోలీసు అధికారులపై తమ వద్ద సమాచారం ఉందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడులో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పోలీసు శాఖను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారంటూ కాంగ్రెస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పోలీసు శాఖ స్వతంత్రంగా, స్నేహపూర్వక వాతావరణంలో పనిచేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై వేధింపులు పెరిగాయని పువ్వాడ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల సూచనల మేరకు తప్పుడు కేసులు నమోదు చేయడం, ఏకపక్షంగా వ్యవహరించడం మానుకోవాలని పోలీసులకు సూచించారు. ప్రతి అంశాన్ని చట్టబద్ధంగా పరిశీలించి నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించాలని కోరారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మారతాయని, భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని పువ్వాడ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారందరి వ్యవహారాలను తాము గమనిస్తున్నామని అన్నారు. పోలీసు అధికారులు ఇకనైనా రాజకీయ ప్రభావాలకు దూరంగా ఉండి రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిర్వర్తించాలని పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట పరిధిలో పనిచేస్తే ఎలాంటి సమస్య ఉండదని స్పష్టం చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రతి చర్యకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# మియాపూర్‌లో మదర్ చైల్డ్ కేర్‌కు కొత్త అడుగు..

### 100 పడకల ఆసుపత్రి ప్రారంభించిన ఎమ్మెల్యే

### తల్లి, బిడ్డల కోసం ప్రత్యేక వైద్య సేవలతో అందుబాటులోకి ప్రణాం ఆసుపత్రి

### ఎన్ఐసీయూ, పీఐసీయూ, మెటర్నల్ ఐసీయూతో పాటు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు

### అందుబాటు ధరల్లో వైద్యం అందించడమే లక్ష్యమని నిర్వాహకుల వెల్లడి

**మియాపూర్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** తల్లి, శిశువులకు ప్రత్యేక వైద్య సేవలను ఒకే వేదికపై అందించేలా మియాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రణాం ఆసుపత్రి సేవలు ప్రారంభమయ్యాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం ఆసుపత్రిని ప్రారంభించారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేకంగా రూపొందించిన వైద్య కేంద్రం తమ ప్రాంతంలో అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణం, వైద్య సేవల ఏర్పాట్లపై డాక్టర్ మనీష్ గౌర్ నేతృత్వంలోని బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రణాం ఆసుపత్రిలో మొత్తం 100 పడకల సదుపాయం ఉంది. ప్రసూతి వైద్యం, శిశు వైద్యం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించేందుకు నవజాత శిశువుల కోసం ఎన్ఐసీయూ, పిల్లల కోసం పీఐసీయూ, తల్లుల కోసం ప్రత్యేక మెటర్నల్ ఐసీయూ అందుబాటులో ఉంచారు. వీటితోపాటు ఆధునిక శస్త్రచికిత్స గదులు, ప్రత్యేక సూట్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ ఇన్ఫెక్షన్ల నియంత్రణకు అనుగుణంగా ఆసుపత్రి వాతావరణాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఇన్ఫెక్షన్ల ముప్పును తగ్గించేలా ఆధునిక రక్షణ చర్యలు కల్పించినట్లు వివరించారు. నిపుణులైన వైద్యులు, అనుభవం కలిగిన సిబ్బంది ద్వారా చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు.ఖరీదైన వైద్యం కారణంగా సామాన్య కుటుంబాలు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన సేవలను అందుబాటు ధరల్లో అందించడమే తమ ఉద్దేశమని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ప్రతి కుటుంబానికి నమ్మకమైన వైద్య కేంద్రంగా ప్రణాంను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.భవిష్యత్‌లో ప్రణాం వైద్య సేవలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించే ప్రణాళిక ఉందని డాక్టర్ మనీష్ గౌర్ తెలిపారు. మహిళలు, చిన్నారులకు అవసరమైన వైద్య సదుపాయాలను మరింత విస్తృతంగా అందించేందుకు సంస్థను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

## చిలుకూరి రాజు మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపిన ఉప్పల లింగస్వామి

**యాదాద్రి భువనగిరి :-** సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరి అంజయ్య చిన్న కుమారుడు చిలుకూరి రాజు గుండె పోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు. వారి మరణ వార్త తెలుసుకోని ఆదివారం వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు చిలుకూరి రాజు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసింది. ఆయన మరణం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థిచారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొన్ రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రత్తుపల్లి యాదయ్య, అందే యాదయ్య, చిలువేరు కృష్ణ, భూపని బలరాం, జక్కల యాదయ్య , గుండమల్ల మల్లేశ్, , మారగోని శంకర్, గునిగంటి రాజు, బోయిని శంకరయ్య ,దుర్గం వెంకటేష్, విడెం సాయి కిశోర్, కర్నాటి నవీన్ వీస అబ్దుల్ , గొల్లూరి గాలయ్య, పెద్దగోని గిరి, రావుల సైదులు గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# పదేళ్ల పాలనపై తేల్చుకుందామా?..

## బీఆర్ఎస్‌కు మహేశ్ గౌడ్ బహిరంగ సవాల్

### ఎక్కడైనా చర్చకు సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడి ప్రకటన

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపాలని సూచన

### కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలు ఎక్కడ చర్చకు పిలిచినా అక్కడికి వస్తానని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ పనితీరు, తమ ప్రభుత్వ పనితీరును ప్రజల సమక్షంలోనే బేరీజు వేసుకుందామని అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో కాంగ్రెస్ నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్లు, నిధులు, ఉద్యోగాల అంశాలు ప్రధానంగా నిలిచాయని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిందా అనే విషయాన్ని కూడా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గత పాలనలో పేరుకుపోయిన అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. పేదలకు సన్నబియ్యం అందించడం, అర్హులకు రేషన్ కార్డులు కల్పించడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. రేషన్ కార్డుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా గతంలో ఎందుకు పరిష్కరించలేదని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

కేటీఆర్ విద్యార్హతలపై చేస్తున్న వ్యాఖ్యలను కూడా మహేశ్ గౌడ్ తప్పుబట్టారు. వ్యక్తికి చదువుతో పాటు సంస్కారం కూడా అవసరమని వ్యాఖ్యానించారు. తెలంగాణకు కేటీఆర్ చేసిన సేవలపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించిందని ఆయన అన్నారు. గద్దర్, అందెశ్రీ వంటి ప్రముఖులను సత్కరించడంతో పాటు హైదరాబాద్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని కూడా తమ ప్రభుత్వం ప్రతిష్ఠించిందని వెల్లడించారు. బీసీ కులగణన విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచి ముందుకు వెళ్తామని మహేశ్ గౌడ్ తెలిపారు. బీసీలకు సంబంధించిన అంశంపై బీజేపీకి చెందిన రాష్ట్ర నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్రను తాము గుర్తిస్తున్నామని, అయితే ప్రస్తుతం ఆయన ప్రజా సమస్యలపై చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ శాసనసభకు హాజరై ప్రభుత్వ విధానాలపై చర్చించాలని మహేశ్ గౌడ్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను సభలో ప్రస్తావించాలని, వాటిపై సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు వ్యవహారశైలిపైనా ఆయన విమర్శలు చేశారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపైనా మహేశ్ గౌడ్ ఆరోపణలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో నగరాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మీనాక్షీ నటరాజన్ నిజాయితీగల నాయకురాలని పేర్కొంటూ, ఆమెకు రాజ్యసభ అవకాశం దక్కాల్సి ఉండగా దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తాయన్న ఆశలు నెరవేరవని, కాంగ్రెస్ భవిష్యత్తులోనూ అధికారంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఈశ్వర్ సాయి వ్యవహారంలో షాకింగ్ ట్విస్ట్..



### ఆత్మహత్యకు యత్నించిన మాధురి రాథోడ్

### మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నంతో ఈశ్వర్ సాయి వివాదం మరోసారి తెరపైకి

### పెళ్లి పేరుతో మోసం, వేధింపులు, ఏఐ మార్ఫింగ్ వీడియోలపై మాధురి ఆరోపణలు

### మాధురి ఫిర్యాదుతో ఈశ్వర్ సాయిపై బీఎన్ఎస్ 69 కింద కేసు

### ఈశ్వర్ సాయి భార్య శరణ్య కూడా మాధురిపై పోలీసులకు ఫిర్యాదు

### ఇరువైపుల ఫిర్యాదులపై పోలీసుల దర్యాప్తు.. వెలుగులోకి రానున్న అసలు వాస్తవాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** జానపద కళారంగానికి చెందిన ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే పరస్పర ఆరోపణలు, పోలీసులకు అందిన ఫిర్యాదులతో చర్చనీయాం శంగా మారిన ఈ అంశం.. తాజాగా మాధురి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటనతో మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వివాదంలో ఇరువైపుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మాధురి రాథోడ్ కొంతకాలం క్రితం నర్సింగి పోలీసులను సంప్రదించి ఈశ్వర్ సాయిపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశారని, అనంతరం తనను వేధింపులకు గురి చేశారని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏఐ సాంకేతికతను ఉపయోగించి మార్ఫింగ్ వీడియోలు తయారు చేశారని కూడా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ఆరోపణల ఆధారంగా పోలీసులు ఈశ్వర్ సాయిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన తర్వాత ఆయన పోలీసులకు చిక్కకుండా ఉన్నారని అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసినట్లు సమాచారం. ఇదే సమయంలో మాధురి రాథోడ్ ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నించిన ఘటన చోటుచేసుకుంది. ఆమెను కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే కాపాడారు. తన ఫిర్యాదుపై ఆశించిన స్థాయిలో చర్యలు జరగడం లేదన్న తీవ్ర ఆవేదనే ఈ నిర్ణయానికి కారణమైందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకుండా రక్షిస్తున్నారన్న ఆరోపణలను కూడా వారు చేస్తున్నారు. కాగా, ఈ వివాదానికి సంబంధించి ఈశ్వర్ సాయి భార్య శరణ్య చేసిన ఫిర్యాదు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఓ హోటల్‌లో ఉన్న ఈశ్వర్ సాయిని కలిసేందుకు వెళ్లిన సమయంలో మాధురి తనపై దాడి చేసి ఐఫోన్‌ను తీసుకున్నారని శరణ్య ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారంలో రెండు వేర్వేరు ఫిర్యాదులు కీలకంగా మారాయి. మాధురి చేసిన ఆరోపణలపై ఇప్పటికే కేసు నమోదు కాగా, శరణ్య ఫిర్యాదులోని అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించిన సాక్ష్యాలు, వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను బట్టి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మాధురి ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో ఈ కేసు మరోసారి తీవ్ర చర్చకు వచ్చింది. అయితే ఇరు వర్గాలు చేసిన ఆరోపణలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసుల విచారణతో పాటు హైకోర్టులో కొనసాగుతున్న పరిణామాలు ఈ వివాదంలో తదుపరి దశను నిర్ణయించే అవకాశం ఉంది.



## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు వేదిక వేంసూరు మండల కమిటీ ఎన్నిక

**ఖమ్మం:** తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భట్టు రాజేందర్ ఆధ్వర్యంలో వేంసూర్ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు వేదిక వేంసూరు మండల కమిటీ అధ్యక్షులుగా మేడ విజయబాబు ఉపాధ్యక్షులుగా కంటే రామకృష్ణ రేగళ్ల రామిరెడ్డి కోశాధికారిగా చెన్నకేశవులు ప్రధాన కార్యదర్శి గా గంద్ర జగన్మోహన్ రెడ్డి గౌడల్లి మోహన్ రావు ఎన్నికైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు వెంటనే ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అజయ్ గౌస్ పూర్ణచందర్రావు మిర్యాల రవి ఆరేపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ను కలసిన ప్రారంభం కానున్న సుప్రజా హాస్పిటల్స్ మేనేజ్మెంట్..

**మియాపూర్ :** మియాపూర్ లొ త్వరలో ప్రారంభం కానున్న సుప్రజ హాస్పిటల్స్ మేనేజ్మెంట్ వారు మియాపూర్ డివిజన్ సీనియర్ నాయకులు , ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ని వారి కార్యాలయం లో మర్యాద పూర్వకం గా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సుప్రజ హాస్పిటల్స్ వారు డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కి నూతనం గా ఏర్పాటు చేస్తున్నటువంటి హాస్పిటల్ కి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మియాపూర్ రానున్న రోజుల్లొ హెల్త్ హబ్ గా తయారు అవుతుంది అని తెలిపారు. అలాగే హాస్పిటల్ యాజమాన్యానికి వారికి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఆసుపత్రి ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. మా ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో సుప్రజ హాస్పిటల్స్ వారి తో కలసి వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.





# అంబేద్కర్ ఆలోచనలకు వేదికగా కొత్త కేంద్రం..

## తారామతిపేట్‌లో శంకుస్థాపన

సామాజిక సమానత్వం, విద్య, సాంస్కృతిక చైతన్యానికి కేంద్రంగా రూపుదిద్దుకోనున్న నిర్మాణం

సైబర్ మెడోస్ వెంచర్‌లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు

మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరు

**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్




బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గాన్ని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు సామాజిక చైతన్యానికి దోహదపడేలా తారామతిపేట్‌లో సాంస్కృతిక కేంద్రం రూపుదిద్దుకోనుంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తారామతిపేట్‌లో ఈ భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో సైబర్ మెడోస్ వెంచర్‌లో ఈ కేంద్రాన్ని నిర్మించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఏర్పాటుకు చొరవ చూపిన అకాడమీ నిర్వాహకులను వారు అభినందించారు. అంబేద్కర్ సిద్ధాంతాలు కేవలం చరిత్రకే పరిమితం కాకుండా నేటి తరంతో పాటు రాబోయే తరాలకు చేరాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో సమానత్వ భావనను బలోపేతం చేయడం, విద్య ప్రాముఖ్యతను వివరించడం, కళలు--సాంస్కృతిక విలువలపై అవగాహన పెంచడం వంటి అంశాల్లో ఈ కేంద్రం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ ఆశయాలు, ఆయన సామాజిక దృక్పథం యువతకు స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ వేదిక ఉపయోగపడాలని వారు పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పూర్తిగ విఫలపాలన పడకేసిన పారిశుద్ధ్యం

**మాడుగుల పల్లి:** బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్ పిలుపుమేరకు నల్గొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పల్లెల విధ్వంసం పడకేసిన పారిశుద్ధ్యం పై ఆదివారం మాడుగుల పల్లి మండలం చెరువుపల్లి గ్రామపంచాయతీ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం కరుణాకర్ రెడ్డి,విలేకరుల సమావేశం లో మాట్లాడుతు కాంగ్రెస్ 1000రోజులలో పల్లెటూర్లలో చేసింది ఏమిలేదని గ్రామ పంచాయతిలు ఎటువంటి అభివృద్ధి నోచుకోలేదని రెడ్డి పారిశుధ్యం పూర్తిగా విఫలమైన్దన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ గడం కర్ణాకర్ రెడ్డి యూత్ అధ్యక్షులు చెరుకుపల్లి రాజు,బుర్రి మల్లారెడ్డి,అలంపల్లి రమేష్, కట్ట శివారెడ్డి,రేముడాల నాగేందర్, వేముల వీరబాబు,పాల్వాయి మధు అంజయ్య పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ లో డీసీఎం బీభత్సం...

### 10 వాహనాలు ఢీ... 7 మందికి గాయాలు....

**మాదాపూర్:** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది.తేదీ 05.09.2026న రాత్రి సుమారు 10:30 గంటలకు ఇనార్బిట్ మాల్ రోడ్, క్యాపిటల్ ల్యాండ్ గేట్ నెం.03 సమీపంలో యూ34డీ2353 నంబర్ గల డీసీఎం వాహనాన్ని అనిల్ కుమార్ అరోల్లా అనే వ్యక్తి ర్యాష్ గా, నిర్లక్ష్యంగా నడుపుతూ ముందు వెళ్తున్న యాక్టివా ద్విచక్ర వాహనంతో సహా పలు వాహనాలను ఢీకొట్టాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో మొత్తం 10 వాహనాలు దెబ్బతిన్నాయి, 7 మంది వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఎవరి పరిస్థితి ప్రాణాపాయంగా లేదని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు Cr.No.1356/2026, U/s 125(a) & 281 దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై డీజీపీ సీరియస్.. ఇక కఠిన చర్యలు!

ట్రాన్స్‌జెండర్ల ఆగడాలకు చెక్.. రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్

కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక కార్యాచరణకు సీపీ ఆనంద్ ఆదేశాలు

శుభకార్యాల వద్ద భారీ మొత్తాలు అడుగుతున్నారన్న ఫిర్యాదులపై దృష్టి

ఉపాధి అవకాశాలు పొందుతూ గౌరవంగా జీవిస్తున్న ట్రాన్స్‌జెండర్లను డీజీపీ ప్రశంస





**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బలవంతపు వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ మరోసారి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది. ట్రాన్స్‌జెండర్ల పేరుతో కొందరు శుభకార్యాల సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఈ అంశంపై సీరియస్‌గా స్పందించారు. రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్ల సీపీలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో జరిగిన గృహప్రవేశ కార్యక్రమం ఈ వ్యవహారంపై మరోసారి చర్చకు కారణమైంది. సెప్టెంబర్ 4న కొత్త ఇంటిలోకి ప్రవేశించేందుకు వచ్చిన కుటుంబాన్ని కొందరు ట్రాన్స్‌జెండర్లు అడ్డుకున్నారని ఆరోపణలు వచ్చాయి. రూ.50 వేల నగదు ఇవ్వాలని వారు పట్టుబట్టినట్లు బాధితురాలు సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో వెల్లడించారు. డబ్బు చెల్లించలేమని చెప్పినప్పటికీ అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. ఈ వీడియో విస్తృతంగా ప్రచారం కావడంతో ఇలాంటి ఘటనలపై పోలీసుల చర్యలు ఎలా ఉండబోతున్నాయన్న చర్చ మొదలైంది. గతంలోనూ ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వచ్చినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సమయంలో బెగ్గింగ్ ముఠాలు, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి నియంత్రణకు చర్యలు తీసుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు డీజీపీ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను భయపెట్టడం లేదా వారి నుంచి బలవంతంగా నగదు తీసుకోవడం వంటి ఘటనలపై పోలీస్ శాఖ దృష్టి సారించనుంది. ఇందులో భాగంగా కమిషనరేట్ల వారీగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టే అవకాశం ఉంది. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్ సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఇలాంటి ఘటనలతో ముడిపెట్టడం సరికాదని డీజీపీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని పలువురు ట్రాన్స్‌జెండర్లు ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నవారు ఉన్నారని వివరించారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలను నియంత్రించడంతో పాటు గౌరవప్రదమైన జీవనానికి అవకాశాలు పొందుతున్న ట్రాన్స్‌జెండర్లకు ప్రోత్సాహం కొనసాగాల్సిన అవసరం ఉందని పోలీస్ శాఖ అభిప్రాయపడుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ప్రత్యేక డ్రైవ్‌పై ఆసక్తి నెలకొంది.

# చెన్నూరు అభివృద్ధి పనులపై బ్రేక్ ఎందుకు?..

కాంగ్రెస్ సర్కారుపై బాల్క సుమన్ ఫైర్

నిలిచిన ఎత్తిపోతల పథకం పనులను తిరిగి చేపట్టాలని డిమాండ్

40 వేల ఉద్యోగాల హామీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రశ్న

22ఏ భూముల సమస్యను పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి




**మందమర్రి, సెప్టెంబర్ 6 (నేటి ప్రస్థానం):** చెన్నూరు నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే పనులను రాజకీయ కారణాలతో నిలిపివేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు క్యాతనపల్లిలోని బాల్క సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేశారు. చెన్నూరు ప్రాంతానికి సాగునీటి వసతి పెంచే ఉద్దేశంతో బీఆర్ఎస్ హయాంలో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులు ప్రారంభించామని బాల్క సుమన్ తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. ఎవరి ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయన్నది కాకుండా ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను పూర్తి చేయడమే పాలకుల బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్ అన్నారు. దీంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన 22ఏ నిషేధిత జాబితా అంశం కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ సమస్య కారణంగా భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. ఎన్నికల ప్రచార సమయంలో నిరుద్యోగులకు 40 వేల ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి ఇచ్చిన హామీని కూడా బాల్క సుమన్ ప్రస్తావించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నందున ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రారంభం కాని, మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలకు అవ సరమైన నిధులు కేటాయించి పనులు వేగవం తం చేయాలని అన్నారు. నేటి నుంచి జరగ నున్న అసెంబ్లీ సమావేశాల్లో చెన్నూరు నియోజ కవర్గానికి సంబంధించిన సమస్యలను మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రస్తావించాలని బాల్క సుమన్ కోరారు. నియోజకవర్గ అవసరాలకు తగిన నిధులు సాధించి పెండింగ్ పనులను పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఈదులగూడ బోనాలలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**మిర్యాలగూడ సెప్టెంబర్ 6:** శ్రావణమాసం బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ శ్రీ ముత్యాల పరమేశ్వరి తల్లి ఆలయంలో ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు పుట్టపాక శ్రీనివాస్, చల్ల సుధాకర్, జె. సుజాత కిరణ్, ముదిరెడ్డి యాదగిరిరెడ్డి, మాల శ్రీనివాస్ రెడ్డి, సైదిరెడ్డి మన్నెం శ్రీనివాస్ రెడ్డి, చిమట శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ సీఐటియు యూనియన్ జిల్లా కార్యదర్శి బొందు పార్వతి, టీచర్స్ టి.అరుణ, పద్మలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కురుమకేసారం బోనాల వేడుకలు

**యాదాద్రి భువనగిరి :-** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కురుమ కేసారం కాలనీలో బోనాల ఊరేగింపులో ఉప్పల లింగస్వామి పాల్గొని మాట్లాడుడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని . గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, మారగోని శంకర్ గౌడ్, కేసారం కాలనీవాసులు ఎర్రోళ్ల వెంకటయ్య, లింగస్వామి, మడపగల సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# రాజకీయాలకు కొత్త దిశ చూపనున్న జెన్-జీ

రాజకీయాలు అంటే ఒకప్పుడు సభలు, సమావేశాలు, భారీ ఊరేగింపులు, గోడపత్రికలు, కరపత్రాలు, పార్టీ జెండాలు, నాయకుల ప్రసంగాలు. రాజకీయ నాయకుడి మాటే ప్రజలకు ప్రధాన సమాచార వనరు. పార్టీ చెప్పిందే సిద్ధాంతం.. నాయకుడు చెప్పిందే నినాదం.. కార్యకర్త చేయాల్సింది ప్రచారం. కానీ కాలం మారింది. సాంకేతికత రాజకీయాల ముఖచిత్రాన్ని మార్చేసింది. ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడు వేదికపై మాట్లాడేలోపే అతని మాట సామాజిక మాధ్యమాల్లో వేల మందికి చేరుతోంది. ఒక నిర్ణయం తీసుకునేలోపే దానిపై ప్రజల స్పందన కనిపిస్తోంది. ఒక హామీ ఇచ్చిన వెంటనే దాని పాత వీడియోను బయటకు తీసి ప్రశ్నించే తరం తయారైంది. ఈ మార్పు వెనుక ఉన్న శక్తే జెన్-జీ. జెన్-జీని కేవలం ఒక వయో వర్గంగా చూడటం సరిపోదు. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంతో పెరిగిన ఈ తరం రాజకీయాలను కూడా కొత్త కోణంలో చూస్తోంది. దీర్ఘమైన ప్రసంగాల కంటే స్పష్టమైన సమాధానాలు కావాలి. నినాదాల కంటే ఫలితాలు కావాలి. హామీల కంటే అమలు కావాలి. నాయకుడి కుటుంబ చరిత్ర కంటే అతని పనితీరు ముఖ్యం. పార్టీ రంగు కంటే తమ భవిష్యత్తు ముఖ్యం. అందుకే జెన్-జీ రాజకీయాల్లోకి ప్రవేశిస్తుందా లేదా అన్న ప్రశ్న కంటే, ఇప్పటికే రాజకీయాలను ప్రభావితం చేయడం మొదలుపెట్టిందా అన్నదే అసలు ప్రశ్న. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా యువత రాజకీయ వ్యవస్థలపై ప్రశ్నలు వేస్తోంది. భారత్‌లోనూ జెన్-జీతో రాజకీయ పార్టీలు కొత్తగా సంభాషించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. యువతను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక ప్రచారాలు, ప్రత్యక్ష సంభాషణలు, యువ నాయకత్వ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. భారతదేశంలో జెన్-జీ సృజనాత్మకత, శక్తి, కొత్త ఆలోచనలతో నిండిన తరమని రాజకీయ నాయకత్వం కూడా బహిరంగంగా చెబుతోంది. కానీ జెన్-జీని కేవలం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే యువతగా పరిమితం చేయడం రాజకీయ పార్టీల మొదటి తప్పు అవుతుంది. ఈ తరం ఎదుర్కొంటున్న సమస్యలు చాలా లోతైనవి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందా? వచ్చినా సరైన వేతనం ఉంటుందా? స్వయం ఉపాధికి అవకాశాలు ఉన్నాయా? కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వల్ల తమ ఉద్యోగాల భవిష్యత్తు ఏమిటి? ఉన్నత విద్య అందుబాటులో ఉంటుందా? నగరాల్లో జీవన వ్యయం ఎలా భరించాలి? చిన్న పట్టణాలు, గ్రామాల్లో అవకాశాలు ఎప్పుడు పెరుగుతాయి? ఇవన్నీ జెన్-జీ మనసులో ఉన్న ప్రశ్నలు.




ఇప్పటి యువతకు రాజకీయాల నుంచి కేవలం ఉచిత పథకాలు మాత్రమే అవసరం లేదు. అవకాశాలు కావాలి. తమ ప్రతిభను ఉపయోగించుకునే వేదిక కావాలి. నాణ్యమైన విద్య కావాలి. ఉద్యోగాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ కావాలి. పారదర్శకమైన నియామక ప్రక్రియ కావాలి. అవినీతికి అడ్డుకట్ట కావాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని కోసం తిరిగే పరిస్థితి తగ్గాలి. తాము చెల్లించే పన్ను ఎక్కడ ఖర్చవుతుందో తెలుసుకునే హక్కు కావాలి. ఇవే కొత్త తరం రాజకీయ అజెండాలోకి వస్తున్న అంశాలు. ఇక్కడే సంప్రదాయ రాజకీయాలకు, జెన్-జీ రాజకీయ ఆలోచనలకు మధ్య తేడా కనిపిస్తోంది. పాత రాజకీయాల్లో "మా పార్టీ అధికారంలోకి వస్తే ఇది చేస్తాం" అనే హామీ ప్రధానంగా ఉండేది. కొత్త తరం మాత్రం "ఎప్పుడు చేస్తారు? ఎలా చేస్తారు? ఎంత ఖర్చవుతుంది? ఇప్పటివరకు ఎందుకు చేయలేదు?" అని అడుగుతోంది. ఒకప్పుడు రాజకీయ నాయకుడిని ప్రశ్నించడం పార్టీ వ్యతిరేకతగా భావించేవారు. ఇప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కుగా యువత చూస్తోంది.

ఈ మార్పును రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో యువతను ఆకట్టుకునేందుకు కొన్ని చిన్న వీడియోలు, వినోదాత్మక ప్రచారాలు, ప్రముఖ వ్యక్తులతో సంభాషణలు నిర్వహించడం మాత్రమే జెన్-జీ రాజకీయాలను గెలుచుకునే మార్గం కాదు. యువతకు కేవలం ప్రచారం కాదు.. పాలనలో భాగస్వామ్యం కావాలి. తమ సమస్యలను చెప్పే అవకాశం కావాలి. తమ ప్రతిపాదనలను వినే వేదిక కావాలి. స్థానిక స్థాయి నుంచి విధాన నిర్ణయాల వరకు యువతకు స్థానం కల్పించాలి. జెన్-జీ రాజకీయాల్లోకి వస్తే సంప్రదాయ రాజకీయ వ్యవస్థకు అది సవాలే. ఎందుకంటే ఈ తరం రాజకీయ కుటుంబ వారసత్వాన్ని సహజ హక్కుగా అంగీకరించకపోవచ్చు. ఒక నాయకుడు ఏ కుటుంబానికి చెందినవాడన్నదానికంటే ఏం చేశాడన్నదే ముఖ్యమని భావించే అవకాశం ఎక్కువ. ఒక పార్టీ దశాబ్దాలుగా అధికారంలో ఉందని దానికే ఓటు వేయాల్సిన అవసరం లేదని భావించవచ్చు. అదే సమయంలో కొత్త పార్టీ పుట్టిందని వెంటనే నమ్మే పరిస్థితి కూడా ఉండదు. పనితీరు, విశ్వసనీయత, పారదర్శకత, వ్యక్తిత్వం వంటి అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకునే స్వభావం పెరుగుతోంది.


అయితే జెన్-జీ రాజకీయాలన్నీ ఆదర్శవంతమైనవే అని చెప్పడం కూడా సరైంది కాదు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే సమాచారం అంతా నిజం కాదు. తప్పుడు వార్తలు, మార్ఫింగ్ వీడియోలు, కృత్రిమ మేధస్సుతో తయారయ్యే నకిలీ దృశ్యాలు, రాజకీయ ప్రచారంలో భాగమైన అర్ధసత్యాలు యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. వేగంగా స్పందించడం మంచిదే కానీ పూర్తి సమాచారం లేకుండా స్పందించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఒక నిమిషం వీడియో చూసి ఒక ప్రభుత్వాన్ని అంచనా వేయలేం. ఒక వైరల్ పోస్టు చూసి ఒక నాయకుడి వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేం. ఒక సామాజిక మాధ్యమ సర్వే చూసి ప్రజల మొత్తం అభిప్రాయాన్ని అర్థం చేసుకోలేం. జెన్-జీకి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు రాజకీయ అవగాహన, రాజ్యాంగంపై అవగాహన, చరిత్రపై అవగాహన, ఆర్థిక విధానాలపై అవగాహన కూడా పెరగాలి.

ఇక్కడ విద్యాసంస్థల పాత్ర కూడా కీలకం. రాజకీయాలపై చర్చ అంటే పార్టీ అనుకూలత, వ్యతిరేకత అనే స్థాయిలో ఉండకూడదు. ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుంది? శాసనసభ పాత్ర ఏమిటి? ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు ఆర్థిక ప్రభావం ఏమిటి? బడ్జెట్ అంటే ఏమిటి? స్థానిక సంస్థలకు అధికారాలు ఎంత? రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులు ఏమిటి? బాధ్యతలు ఏమిటి? వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించాలి. రాజకీయ పార్టీలు కూడా యువతను కేవలం ఎన్నికల సమయంలో గుర్తు చేసుకునే పద్ధతిని మార్చుకోవాలి. ఎన్నికలకు ఆరు నెలల ముందు యువత కోసం ప్రత్యేక సమావేశాలు పెట్టి, ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం సరిపోదు. ఏడాది పొడవునా యువతతో సంభాషణ కొనసాగాలి. పార్టీ మేనిఫెస్టో రూపొందించే ముందు యువత అభిప్రాయాలు తీసుకోవాలి. స్థానిక సమస్యలపై యువ ప్రతినిధులను ముందుకు తీసుకురావాలి. పార్టీ పదవుల్లో వయస్సుతో పాటు సామర్థ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.

తెలంగాణ వంటి యువ రాష్ట్రంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం కలిగినది. హైదరాబాద్ ప్రపంచ స్థాయి సాంకేతిక, సేవా రంగాలకు కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో యువతకు సరైన అవకాశాలు అందుబాటులో లేవు. పట్టణాల్లో ఒక రకమైన సమస్యలు.. గ్రామాల్లో మరో రకమైన సమస్యలు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ప్రైవేటు ఉద్యోగాల్లో భద్రత, వేతనాలపై ఆందోళనలు ఉన్నాయి. ఉన్నత విద్య ఖర్చులు పెరుగుతున్నాయి. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన యువతకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అవసరం. ఇవన్నీ రాజకీయ పార్టీలకు స్పష్టమైన అజెండాగా మారాలి. జెన్-జీ రాజకీయాల్లోకి రావడం అంటే అందరూ ఎన్నికల్లో పోటీ చేయాలని కాదు. ఒకరు స్థానిక సమస్యపై ఉద్యమించవచ్చు. మరొకరు సామాజిక సంస్థ ద్వారా పనిచేయవచ్చు. ఇంకొకరు డిజిటల్ వేదిక ద్వారా ప్రభుత్వ పనితీరును విశ్లేషించవచ్చు. మరొకరు రాజకీయ పార్టీలో చేరి విధాన రూపకల్పనలో భాగస్వామి కావచ్చు. ఇంకొకరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. రాజకీయ భాగస్వామ్యానికి రూపాలు మారవచ్చు కానీ ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం తగ్గకూడదు.

ఇటీవల ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యువత ఉద్యమాలు రాజకీయ వ్యవస్థలను కుదిపిన ఉదాహరణలు కనిపిస్తున్నాయి. యువత అవినీతి, పాలనా వైఫల్యం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై వీధుల్లోకి రావడం మాత్రమే కాదు, సామాజిక మాధ్యమాలను కూడా సమీకరణ సాధనంగా ఉపయోగిస్తోంది. నేపాల్‌లో జరిగిన జెన్-జీ ఉద్యమంపై వచ్చిన విశ్లేషణలు కూడా యువత సంప్రదాయ రాజకీయాలపై అసంతృప్తి నుంచి ఫలితాల ఆధారిత రాజకీయాల వైపు చూస్తోందని పేర్కొన్నాయి. అయితే ఉద్యమం చేయడం ఒకటి.. పాలన చేయడం మరొకటి. ఇది జెన్-జీ ముందున్న అతిపెద్ద పరీక్ష. ప్రభుత్వాన్ని విమర్శించడం సులభం. అధికారంలోకి వచ్చిన తర్వాత పరిమిత వనరులతో ప్రజల అంచనాలను నెరవేర్చడం కష్టం. ఒక మంచి నినాదంతో ప్రజలను ఆకర్షించవచ్చు. కానీ మంచి బడ్జెట్ రూపొందించడానికి ఆర్థిక పరిజ్ఞానం కావాలి. ఒక వైరల్ వీడియోతో ఎన్నికల్లో దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ ఐదేళ్లపాటు వ్యవస్థను నడిపించడానికి సంస్థాగత బలం కావాలి. అందుకే జెన్-జీ రాజకీయాలకు శక్తితో పాటు సహనం కూడా అవసరం. ఆవేశంతో నిర్ణయాలు తీసుకోకుండా, ఆధారాలతో మాట్లాడటం నేర్చుకోవాలి. నాయకుడిని ప్రశ్నించినట్టే తమ నాయకుడినీ ప్రశ్నించాలి. ప్రత్యర్థి తప్పును ఎత్తిచూపినట్టే తమ పార్టీ తప్పును కూడా అంగీకరించాలి. తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వ్యక్తిని శత్రువుగా చూడకూడదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయం బలహీనత కాదు.. బలం.

ఇంకొక ముఖ్యమైన అంశం రాజకీయాల్లో వ్యక్తి ఆరాధన. పాత తరాల రాజకీయాల్లో నాయకుడి చుట్టూ పార్టీ నిర్మాణం జరిగేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు కొత్త రకమైన వ్యక్తి ఆరాధనకు అవకాశం కల్పిస్తున్నాయి. ఒక నాయకుడి ప్రతి మాటను ప్రశ్నించకుండా సమర్థించడం జెన్-జీ రాజకీయాలకు విరుద్ధం. వ్యక్తులు మారుతారు. పార్టీలు మారుతాయి. ప్రభుత్వాలు మారుతాయి. కానీ సంస్థలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు కొనసాగాలి. అందుకే జెన్-జీ రాజకీయాల లక్ష్యం "కొత్త నాయకులు" మాత్రమే కాకుండా "కొత్త రాజకీయ సంస్కృతి" కావాలి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గాలి. ఎన్నికల్లో ఖర్చు పారదర్శకంగా ఉండాలి. అభ్యర్థుల నేర చరిత్ర, ఆస్తులు, విద్య, పనితీరు వంటి వివరాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందాలి. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గానికి ఇచ్చిన హామీల అమలు స్థితిని క్రమం తప్పకుండా వెల్లడించాలి. ఈ సంస్కరణలను కోరే శక్తిగా జెన్-జీ ఎదగాలి. సామాజిక మాధ్యమాలు జెన్-జీ చేతిలో ఒక గొప్ప ఆయుధం. కానీ అదే సమయంలో అది బాధ్యత కూడా. ఒక తప్పుడు వార్త ఒక వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయగలదు. ఒక నకిలీ వీడియో సామాజిక ఉద్రిక్తతను పెంచగలదు. ఒక నిర్ధారణ లేని ఆరోపణ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపగలదు. అందువల్ల "ముందు పంచుకోవడం.. తర్వాత నిజమా కాదా చూడటం" అనే అలవాటు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. సమాచారం వేగం కంటే సమాచారం నిజం ముఖ్యమని యువత గుర్తించాలి. జెన్-జీకి రాజకీయ పార్టీలు కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. యువతను మభ్యపెట్టడం సాధ్యం కాదు. ఒకసారి మోసం చేయవచ్చు. రెండోసారి అనుమానం రావచ్చు. మూడోసారి ప్రశ్న మొదలవుతుంది. ఎన్నికల సమయంలో విడుదల చేసే ప్రచార వీడియోల కంటే ఐదేళ్ల పాలనలో కనిపించే ఫలితాలే చివరకు మాట్లాడతాయి. సోషల్ మీడియా ప్రచారంతో కొంతకాలం వాతావరణాన్ని మార్చవచ్చు కానీ నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం రాకపోతే అతని అసంతృప్తిని శాశ్వతంగా దాచలేం.



# రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమోబీ మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు 'తమది కాని' భాషలో సాహిత్యం సృజించారు. 1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని 'జింగు' స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం %--% తన మాతృభాషలో 'పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా' ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. 'ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్ నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో 'సాహిత్యం' లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?' అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. 'మై కిచెన్ టేబుల్ ఫిక్షన్ ' ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన 'హియర్ ద విండ్ సింగ్' నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది. కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్ లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా 'ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్' నవలకు 'పులిట్జర్' గెలుచుకుంది. 'నేమ్‌సేక్'తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్ లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. 'పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ'. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్ లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్ లో రాయడమేంటని చాలామందే ఆమెను ప్రశ్నించారు.

# రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?




**సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ.**

**భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం.**

సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బం దులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుం డటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శుభ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడి పోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుఫాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే 'స్వచ్ఛ రైల్-స్వచ్ఛ్ భారత్' నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దిశగా రైల్వే అధికారులు దృష్టి సారించాలి.



## జీతం మొత్తం ఈఎంఐలకే సరిపోతోందా?

నెల మొదట్లో జీతం ఖాతాలో పడడమే ఆలస్యం చూస్తుండగానే ఈఎంఐల రూపంలో ఖాతా ఖాళీ అవుతోంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బకాయిలు, గృహ, వాహన రుణాల ఈఎంఐలు కలిపి జీతంలో సగానికి పైగా మింగేస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక నిపుణులు చెప్పే మూడు కీలక సూత్రాలు ఇప్పుడు ప్రతి ఒక్కరికీ దిక్సూచిలా ఉపయోగపడతాయి.

**మొదటిది..**

మీ మొత్తం ఈఎంఐ భారం తీసుకునే వేతనంలో 40 శాతం మించకుండా చూసుకోవాలి. అంతకు మించితే ఒంటిపై చేయి భారం అన్నట్టుగా నెలవారీ ఖర్చులకూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. వైద్య ఖర్చులు, పాఠశాల ఫీజు వంటి ఏ ఖర్చు వచ్చినా తర్వాతి నెల ఈఎంఐ ఎగవేతకు దారితీసే ప్రమాదం ఉంటుంది.

**రెండోది..**

అధిక వడ్డీ రుణాలను ముందుగా తీర్చాలి. క్రెడిట్ కార్డు బకాయిలపై వడ్డీ 30–40 శాతం వరకు ఉంటుంది కాబట్టి, వాటిని మొదట క్లియర్ చేసుకోవడం ఉత్తమం. అవసరమైతే, అనేక చిన్న రుణాలను ఒకే రుణంగా కన్సాలిడేట్ చేసుకుని తక్కువ వడ్డీకి మారడం వల్ల నెలవారీ భారం తగ్గుతుంది.

**మూడోది..**

కొత్త అప్పు తీసుకోవడం ఆపేయాలి. అప్పు చేసి పప్పు కూడు అనే సామెతను గుర్తు చేసుకుంటూ అనవసర ఖర్చులకు, గాడ్జెట్లకు నో–కాస్ట్ ఈఎంఐల ఆకర్షణలో పడకూడదు. బదులుగా, జీతం అందిన వెంటనే కొంత మొత్తాన్ని పొదుపు లేదా సిప్‌కు ఆటోమేటిక్‌గా బదిలీ చేసుకోవాలి. మిగిలిన దానితోనే బడ్జెట్ ప్రణాళిక వేసుకోవడం మేలు. అప్పుల ఊబి నుంచి బయటపడాలంటే క్రమశిక్షణ, స్థిరమైన ప్రణాళికే మార్గం అని గుర్తుంచుకోవాలి. రాత్రికి రాత్రి పరిష్కారం సాధ్యం కాదు, కానీ ఓపిక వహిస్తే ఆర్థిక స్వేచ్ఛ దూరం కాదు.

## త్వరలో చిన్న ఎలక్ట్రిక్ బస్సులు

### ఎస్ఎంఎల్ మహీంద్రా చైర్మన్ వినోద్ సహాయ్

### హైదరాబాద్ మార్కెట్లోకి బ్లేజో ఐ--టీఆర్‌కే వాహనాలు



హైదరాబాద్,: స్కూళ్లు మొదలైన వాటిల్లో ఉపయోగించే తేలికపాటి వాణిజ్య వాహనాల విభాగంలో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు తేనున్నట్లు మహీంద్రా ట్రక్స్ అండ్ బసెస్ ప్రెసిడెంట్, ఎస్ఎంఎల్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వినోద్ సహాయ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం లేదా వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వీటిని ప్రవేశపెట్టే అవకాశం ఉందని వివరించారు. హెచ్‌సీవీ (భారీ వాణిజ్య వాహనాలు) విభాగంలో ఎలక్ట్రిక్ వాహనాలను తేవాలంటే చార్జింగ్ మౌలిక సదుపాయాలు, ధరలపరమైన సవాళ్లు ఉంటున్నాయని సహాయ్ చెప్పారు. హైదరాబాద్ మార్కెట్లో సరికొత్త బ్లేజో--ఐటీఆర్‌కే భారీ వాణిజ్య ట్రక్కుల (హెచ్‌సీవీ) శ్రేణిని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. 25 నుంచి 55 టన్నుల వరకు సామర్థ్యం ఉండే ఈ వాహనాల ధర రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు ఉంటుంది. నిర్వహణ వ్యయాలు భారీగా తగ్గేలా, యజమానుల లాభదాయకత పెరిగేలా వీటిని తీర్చిదిద్దినట్లు సహాయ్ చెప్పారు.

# ఆ రాత్రి పంపిన సందేశం.. రూ.కోటి సంపాదనకు మార్గం!

**జీవితాన్ని మార్చడానికి కొన్నిసార్లు పెద్ద పెట్టుబడి, డిగ్రీ లేదా భారీ పరిచయాలు అవసరం ఉండకపోవచ్చు. సరైన సమయంలో వేసే ఒక్క అడుగు కూడా కెరీర్‌కు కొత్త దారిని చూపించొచ్చు. ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది యువ రచయిత, ఫ్రీలాన్సర్ ఆదిత్య బన్సాల్ కథ. 17 ఏళ్ల వయసులో పోడ్‌కాస్టర్, ఎంట్రాప్రెన్యూర్ రాజ్ షమానీకి ఓ అర్ధరాత్రి పంపిన డీఎం (సందేశం).. తన కెరీర్‌ను మలుపుతిప్పిందని బన్సాల్ తాజాగా వెల్లడించారు. ఆ అవకాశంతో మొదలైన ప్రయాణంలో 22 ఏళ్ల వయసుకే రూ.1 కోటి సంపాదించినట్లు ఆయన పేర్కొన్నారు.**



**జేఈఈ ప్రిపరేషన్ నుంచి ఆన్‌లైన్ కంటెంట్ వైపు..**

2021లో బన్సాల్ జేఈఈకి సిద్ధమవుతున్నారు. పరీక్ష అక్టోబర్‌కు వాయిదా పడిన సమయంలో యూట్యూబ్‌లో స్వయంవృద్ధి, ఆదాయ మార్గాలకు సంబంధించిన వీడియోలను ఎక్కువగా చూడటం మొదలుపెట్టారు. అందులో భాగంగానే రాజ్ షమానీ వీడియోలను కూడా ఫాలో అయ్యేవారు. అప్పటికే డబ్బు సంపాదించేందుకు గ్రాఫిక్ డిజైన్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ వంటి మార్గాలను ప్రయత్నించినా అవి సఫలం కాలేదని బన్సాల్ చెప్పారు. అప్పటికి తన ముందున్న సాధారణ మార్గం జేఈఈ రాయడం.. ఇంజినీరింగ్ చదవడం.. ఆ తర్వాత ఉద్యోగం చేయడమేనని ఆయన గుర్తుచేసుకున్నారు. కానీ ఆ దారిలో తన భవిష్యత్తు ఎలా ఉంటుందో ముందే ఊహించగలిగానని, అది తనకు నచ్చలేదని తెలిపారు.

**రాత్రి పంపిన డీఎం..**

ఒకరోజు షమానీ ఆదాయ మార్గాలపై చేసిన వీడియోను చూసిన బన్సాల్.. అందులోని ఆలోచనలను ట్విట్టర్ (ప్రస్తుతం 'ఎక్స్') థ్రెడ్‌గా మార్చాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గూగుల్ డాక్‌లో గంటల తరబడి పనిచేసి, ఎలాంటి ఉద్యోగం లేదా డబ్బు ఆశించకుండా ఆ థ్రెడ్‌ను షమానీకి నేరుగా పంపించారు. రాత్రి 10:41 గంటలకు పంపిన ఆ డీఎంకు తెల్లవారుజామున 3:53 గంటలకు సమాధానం వచ్చింది. థ్రెడ్‌ను ముందుగా పోస్ట్ చేసి స్పందన ఎలా వస్తుందో చూస్తానని, మంచి ఫలితం వస్తే తన ట్విట్టర్ థ్రెడ్‌ల కోసం బన్సాల్‌ను నియమించుకుంటానని షమానీ చెప్పినట్లు ఆయన వెల్లడించారు.

**17 ఏళ్లకే తొలి పెయిడ్ వర్క్..**

బన్సాల్ పంపిన థ్రెడ్‌కు సుమారు 1,200 లైక్స్ వచ్చాయి. తాను అప్పటికి పెద్దగా అనుభవం లేని రచయితనని, ఆ థ్రెడ్ తన అత్యుత్తమ రచన కూడా కాదని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ షమానీ అతనిలోని సామర్థ్యాన్ని గుర్తించి అవకాశం ఇచ్చారు.ఆ తర్వాత బన్సాల్ షమానీ కోసం సుమారు 5--6 ట్విట్టర్ థ్రెడ్‌లు రాశారు. అప్పటికి తనకు బ్యాంక్ అకౌంట్ లేకపోవడంతో అమెజాన్ గిఫ్ట్ కార్డుల రూపంలో చెల్లింపులు అందుకున్నట్లు తెలిపారు. అయితే ఈ అనుభవంలో తనకు లభించిన అసలు విలువ డబ్బు కాదని బన్సాల్ చెప్పారు. కంటెంట్ కోసం అవసరమైన సమాచారం, సోర్సులు, మెటీరియల్‌ను షమానీ అందించడంతో పాటు తనను టీమ్‌లో ఒకరిగా చూసేవారని గుర్తుచేసుకున్నారు.

## రియల్ 'ఈల్డ్' జోరు.. రేసులోకి హైదరాబాద్!

భారతదేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన మార్పులకు లోనవుతోంది. ఒక ప్రాపర్టీ విలువ ఆధారంగా ఏడాదికి వచ్చే అద్దె ఆదాయాన్ని కొలిచే రెంటల్ ఈల్డ్ గత ఏడేళ్లలో క్రమంగా పుంజుకోవడం ఇన్వెస్టర్లకు సానుకూల సంకేతాలను ఇస్తోంది. 'అనరాక్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ' గణాంకాల ప్రకారం 2019 నుంచి 2026 రెండో త్రైమాసికం నాటికి దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో రెంటల్ ఈల్డ్స్ గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌ను ప్రత్యేకంగా గమనిస్తే ఇక్కడ రెంటల్ ఈల్డ్ 2019లో ఉన్న 2.6 శాతం నుంచి 2026 నాటికి 3.6 శాతానికి పెరిగింది. ఇది దేశంలోనే అత్యధిక శాతం పెరుగుదలలో ఒకటి కావడం విశేషం. ఐటీ, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగులు తిరిగి ఆఫీసులకు రావడం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల విస్తరణ వల్ల ప్రధాన ఉద్యోగ కేంద్రాలకు సమీపంలో ఉన్న నివాసాలకు డిమాండ్ విపరీతంగా పెరిగిందని రియల్టీ నిపుణులు చెబుతున్నారు. ఈ డేటాను విశ్లేషించేటప్పుడు ఇన్వెస్టర్లు కేవలం అద్దె ఆదాయాన్నే కాకుండా ప్రాపర్టీ విలువ పెరిగే అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బెంగళూరు, ముంబై, గురుగ్రామ్ వంటి నగరాలు స్థిరమైన నగదు ప్రవాహాన్ని కోరుకునే వారికి అనుకూలంగా ఉ?న్నాయి. హైదరాబాద్ వంటి నగరాలు వేగవంతమైన వృద్ధి, మెరుగైన క్యాపిటల్ అప్రిసియేషన్ రెండింటినీ అందిస్తున్నాయి.

## భారత్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో 'వియోనా' యూపీఐ స్విచ్ సేవలు




దేశీయ డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాల రంగంలో హైదరాబాద్‌కు చెందిన ఫిన్‌టెక్ సంస్థ వియోనా ఫిన్‌టెక్ కీలక మైలురాయిని అధిగమించింది. భారత్ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో తన యూపీఐ స్విచ్ సాంకేతికతను విజయవంతంగా అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఈ సాంకేతిక అనుసంధానం ద్వారా భారత్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఇకపై నేరుగా యూపీఐ నెట్‌వర్క్‌తో అనుసంధానమై లావాదేవీల రూటింగ్, పర్యవేక్షణ, ఆపరేషనల్ కంట్రోల్స్ నిర్వహించనుంది. కేవలం యాప్‌లు నిర్మించడమే కాకుండా బ్యాంకింగ్ రంగానికి అవసరమైన సాంకేతిక మౌలిక వసతులను అందించడంపై వియోనా దృష్టి సారించింది. యూపీఐ, ఐఎంపీఎస్ స్విచింగ్, ఇంటర్నెట్–మొబైల్ బ్యాంకింగ్, భారత్ కనెక్ట్ (బీబీపీఎస్) సహా మర్చంట్ పేమెంట్స్, రికవరీలకు సంబంధించిన సమగ్ర సేవలను ఈ సంస్థ అందిస్తోంది.'సాంకేతికతను అభివృద్ధి చేసి సర్టిఫికేషన్ పొందడం ఒక ఎత్తైతే, ఒక ప్రధాన బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రత్యక్ష లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహించడం మరో ఎత్తు. ఈ విజయంతో మరింత విస్తృతంగా సేవలు అందించే అవకాశం లభించింది' అని వియోనా ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు, సీఈఓ రవీంద్రనాథ్ యార్లగడ్డ తెలిపారు. కస్టమర్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపు చేసే కొద్ది సెకన్ల వ్యవధిలో వ్యవస్థ వెనుక జరిగే సురక్షిత లావాదేవీల ప్రక్రియే డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయతను నిర్దేశిస్తుందని ఆయన పేర్కొన్నారు. భద్రత, నియంత్రణ నిబంధనలకు లోబడి తమ సాంకేతికతను ఆధునీకరించుకోవాలనుకునే కో–ఆపరేటివ్, ప్రాంతీయ బ్యాంకులను ప్రధాన అవకాశంగా వియోనా భావిస్తోంది. దేశీయ ఇంజినీర్లతో రూపొందించిన ఈ యూపీఐ స్విచింగ్ సాంకేతికత రాబోయే రోజుల్లో ఇతర బ్యాంకులను ఆకర్షిస్తుందని కంపెనీ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు.

# రియల్ 'ఈల్డ్' జోరు.. రేసులోకి హైదరాబాద్!

**భారతదేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన మార్పులకు లోనవుతోంది. ఒక ప్రాపర్టీ విలువ ఆధారంగా ఏడాదికి వచ్చే అద్దె ఆదాయాన్ని కొలిచే రెంటల్ ఈల్డ్ గత ఏడేళ్లలో క్రమంగా పుంజుకోవడం ఇన్వెస్టర్లకు సానుకూల సంకేతాలను ఇస్తోంది.**

'అనరాక్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ' గణాంకాల ప్రకారం 2019 నుంచి 2026 రెండో త్రైమాసికం నాటికి దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో రెంటల్ ఈల్డ్స్ గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌ను ప్రత్యేకంగా గమనిస్తే ఇక్కడ రెంటల్ ఈల్డ్ 2019లో ఉన్న 2.6 శాతం నుంచి 2026 నాటికి 3.6 శాతానికి పెరిగింది. ఇది దేశంలోనే అత్యధిక శాతం పెరుగుదలలో ఒకటి కావడం విశేషం. ఐటీ, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగులు తిరిగి ఆఫీసులకు రావడం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల విస్తరణ వల్ల ప్రధాన ఉద్యోగ కేంద్రాలకు సమీపంలో ఉన్న నివాసాలకు డిమాండ్ విపరీతంగా పెరిగిందని రియల్టీ నిపుణులు చెబుతున్నారు. ఈ డేటాను విశ్లేషించేటప్పుడు ఇన్వెస్టర్లు కేవలం అద్దె ఆదాయాన్నే కాకుండా ప్రాపర్టీ విలువ పెరిగే అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బెంగళూరు, ముంబై, గురుగ్రామ్ వంటి నగరాలు స్థిరమైన నగదు ప్రవాహాన్ని కోరుకునే వారికి



అనుకూలంగా ఉ?న్నాయి. హైదరాబాద్ వంటి నగరాలు వేగవంతమైన వృద్ధి, మెరుగైన క్యాపిటల్ అప్రిసియేషన్ రెండింటినీ అందిస్తున్నాయి. భవిష్యత్తులో పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఉద్యోగ కేంద్రాలు, మెట్రో రవాణా వసతులు ఉన్న ప్రాంతాల్లో 2 బీహెచ్‌కే లేదా 3 బీహెచ్‌కే ఫ్లాట్లను ఎంచుకోవడం ద్వారా ప్రాపర్టీ ఖాళీగా ఉండే సమయాన్ని తగ్గించవచ్చు. అలాగే రెసిడెన్షియల్ ప్రాపర్టీల్లో 3 నుంచి 4.6 శాతం మధ్య ఉండే ఈల్డ్స్‌తో పోలిస్తే, కమర్షియల్ ప్రాపర్టీల ద్వారా 7 నుంచి 9 శాతం వరకు అద్దె రాబడి సాధించే అవకాశాలు ఉంటాయి కాబట్టి ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను తగిన విధంగా విస్తరించుకోవాలి.

## డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త విధానం.. కీలక ప్రతిపాదనలు

ట్రాఫిక్ నిబంధనలు పదేపదే ఉల్లంఘించే వాహనదారులకు ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకునే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు గ్రేడెడ్ పాయింట్ల విధానం తీసుకొచ్చే అంశాన్ని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ 66వ వార్షిక సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ రికార్డులో ప్రతికూల పాయింట్లు నమోదవుతాయి. ఒక నిర్దిష్ట పరిమితికి ఈ పాయింట్లు చేరితే డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం లేదా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏ నేరానికి ఎన్ని పాయింట్లు, ఎంత పరిమితికి ఏ చర్య అనే పూర్తి నిబంధనలను ప్రభుత్వం వెల్లడించలేదు. అంటే వేగంగా వాహనం నడపడం, సిగ్నల్ జంప్ చేయడం, ప్రమాదకర డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలు ఒక్కోసారి జరిమానాతో ముగిసిపోకుండా.. డ్రైవర్ మొత్తం రికార్డుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ విధానం ఉద్దేశం.

**మంచి డ్రైవర్లకు ప్రోత్సాహకాలు**

ఈ విధానం కేవలం శిక్షలకు పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వాహనం నడిపే వారికి ప్రోత్సాహకాలు అందించేలా ఉండొచ్చని గడ్కరీ తెలిపారు. మంచి డ్రైవింగ్ రికార్డు ఉన్నవారికి బీమా సంస్థల నుంచి ప్రోత్సాహకాలు లేదా ఇతర ప్రయోజనాలు లభించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే ఈ ప్రయోజనాలు ఎలా ఉంటాయన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

**రోడ్డు భద్రతపై పెరుగుతున్న ఆందోళన**

డ్రైవర్ ప్రవర్తన దేశంలో రోడ్డు భద్రతకు ప్రధాన సవాలుగా ఉందని గడ్కరీ పేర్కొన్నారు. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 5,13,563 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో సుమారు 1.83 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 59 ప్రమాదాలు, 21 మరణాలు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

# హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్.. ప్రేక్షకులనే నిందిస్తూ మేకర్స్ తప్పించుకుంటున్నారా?




సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది.కొత్త సినిమాలు చూడండిసినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది.సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది. అలా క్రమంగా సినిమా కథ, కళ, నటన వంటి అంశాలు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆమె అభిప్రాయపడింది. కరోనా మహమ్మారికి ముందు సినీ పరిశ్రమ మంచి మార్పు దిశగా పయనించిందని తాప్సీ చెప్పింది. అయితే ప్రస్తుతం మళ్లీ కొన్ని పాత పద్ధతులు తిరిగి వస్తున్నాయని ఆమె అభిప్రాయపడింది.సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే దానికి ప్రేక్షకుల అభిరుచులను కారణంగా చూపుతూ మేకర్స్ తప్పించుకునే పరిస్థితి ఉందని తాప్సీ వ్యాఖ్యానించింది. నటీనటులు పరిశ్రమలో మార్పు కోసం ఎంత ప్రయత్నించినా.. ప్రేక్షకుల నుంచి మద్దతు లేకపోతే ఆ పోరాటంలో విజయం సాధించడం కష్టమని ఆమె చెప్పుకొచ్చింది.



# 'అప్పట్లో దేవుళ్లు.. ఇప్పుడు స్మగ్లర్లు, క్రిమినల్స్'

టాలీవుడ్ నటి కస్తూరి శంకర్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రస్తుతం ఇండస్ట్రీలో వస్తోన్న మూవీస్‌పై కీలక వ్యాఖ్యలు చేసింది. మన తెలుగులో మొదట్లో హీరోలు దేవుడి పాత్రల్లో నటించేవారని తెలిపింది. ఆ తర్వాత వచ్చిన సినిమాల్లో హీరోలు పోలీస్, లాయర్, విప్లవాత్మకమైన పాత్రలు ఎక్కువగా కనిపించాయని పేర్కొంది. అయితే ఈ నాటి చిత్రాల్లో మాత్రం స్మగ్లర్, క్రిమినల్ లాంటి పాత్రల్లో మాత్రమే హీరోలు కనిపిస్తున్నారని విమర్శించింది. సోషల్ మేసేజ్‌తో వచ్చే చిత్రాలు చాలా తగ్గాయని ఆవేదన వ్యక్తం చేసింది. కస్తూరి శంకర్ మాట్లాడుతూ.." చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలి. ఒకప్పుడు తెలుగు సినిమా అంటే మాయాబజారు, కృష్ణార్జున యుద్ధం, ప్రేమాభిషేకం లాంటి చిత్రాలు చూసేదాన్ని. అప్పట్లో దేవుడి పాత్రల్లో ఎక్కువ కనిపించేవారు. కానీ ఇప్పుడు సినిమాల్లో మాత్రం స్మగ్లర్, క్రిమినల్ పాత్రలు చేసే సినిమాలు వస్తున్నాయి. ఆనాడు ఒక సామాజిక బాధ్యతతో సినిమాలు చేసేవారు. అలాంటి సోషల్ మేసేజ్ ఇచ్చే మూవీనే మా ధర్మస్థల నియోజకవర్గం" అని తెలిపింది. ఆమె కీలక పాత్రలో నటించిన ధర్మస్థల నియోజకవర్గం ఇవాళే థియేటర్లలో రిలీజైంది. ఈ సందర్భంగా కస్తూరి శంకర్ తెలుగు సినిమాలను ఉద్దేశించి కామెంట్స్ చేసింది.

# అల్లు అర్జున్ రాకా.. రాక అప్పుడేనా?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న మూవీ రాకా. ఈ సినిమాకు కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ?అట్లీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ ఈ మూవీపై అంచనాలు మరించ పెంచేశాయి. ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌లో కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ల్లు అర్జున్ త్రి పాత్రాభినయం చేస్తున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. తాజాగా ఈ చిత్రం గురించి మరో టాక్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ రిలీజ్ డేట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. 2028 జనవరి 26న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని టాక్ వినిపిస్తోంది. ఈ తేదీపై మేకర్స్ నుంచి ఎలాంటి అఫీషియల్ ప్రకటనైతే రాలేదు. దీంతో బన్నీ ఫ్యాన్స్ రాకా రిలీజ్ విషయంలో కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. అధికారిక ప్రకటన వస్తేనే ఫుల్ క్లారిటీ రానుందని తెలుస్తోంది. కాగా.. ఈ చిత్రంలో తండ్రి... ఇద్దరు కొడుకులు... ఇలా ట్రిపుల్ రోల్స్ చేస్తున్నారట అల్లు అర్జున్. అంతేకాదు... ఈ మూడు పాత్రల్లో ఒకటి విలన్ రోల్ అని సమాచారం. ఇదే నిజమైతే 'రాకా' చిత్రంలో హీరోగా, విలన్‌గా అల్లు అర్జున్ నటన చూడొచ్చు. ఈ సినిమాలోని ఓ లీడ్ రోల్‌లో దీపికా పదుకోణె నటిస్తున్నారు. ఈ సినిమాకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.


# మోక్షజ్ఞ డెబ్యూ మూవీపై బిగ్ అప్‌డేట్..

**దసరాకే గ్రాండ్ లాంచ్, రిలీజ్ డేట్ కూడా అప్పుడే ప్రకటిస్తారా..!**





నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణకు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేకమైన స్థానం ఉంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు నట వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బాలయ్య.. తనదైన నటన, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ ఇమేజ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ముఖ్యంగా బి, సి సెంటర్లలో బాలకృష్ణకు ఉన్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అదే నందమూరి కుటుంబం నుంచి మరో తరం హీరోగా మోక్షజ్ఞ ఎంట్రీ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత కొన్నేళ్లుగా మోక్షజ్ఞ సినీ ఎంట్రీపై అనేక వార్తలు, ఊహాగానాలు వచ్చినప్పటికీ.. ఇప్పటివరకు ఆయన డెబ్యూ మూవీపై అధికారికంగా పూర్తి స్థాయి క్లారిటీ రాలేదు. అయితే తాజాగా మోక్షజ్ఞ ఎంట్రీకి సంబంధించి ఓ ఆసక్తికరమైన ప్రచారం ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.మోక్షజ్ఞ తొలి సినిమా ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఉంటుందని గతంలో జోరుగా ప్రచారం జరిగింది. ఈ ప్రాజెక్ట్‌పై అప్పట్లో నందమూరి అభిమానుల్లో కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే అనుకున్న విధంగా ఆ సినిమా కార్యరూపం దాల్చలేదు.దీంతో మోక్షజ్ఞ డెబ్యూ విషయంలో బాలకృష్ణ మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. తన కుమారుడి మొదటి సినిమా విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా.. కథ, దర్శకుడు, మేకింగ్, రిలీజ్ ప్లాన్ ఇలా ప్రతి అంశాన్ని పక్కాగా సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. రాబోయే దసరా పండుగ సందర్భంగా మోక్షజ్ఞ డెబ్యూ సినిమాను అధికారికంగా లాంచ్ చేసేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.కొత్త సినిమాలు చూడండి అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి దసరాకే లాంచ్ అవుతుందనే వార్తను ప్రస్తుతానికి ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారంగానే చూడాలి. మోక్షజ్ఞ డెబ్యూ మూవీ విషయంలో మరో ఆసక్తికరమైన విషయం కూడా చర్చకు వస్తోంది. సినిమా పూజా కార్యక్రమాలు జరిగే రోజునే మూవీ రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.



# నేపాల్ బాధితుల సాయంపై ట్రోలింగ్.. స్పందించిన సోనూసూద్!

నేపాల్ వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్లిన ప్రముఖ నటుడు సోనూసూద్‌పై సోషల్ మీడియా వేదికగా విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. సహాయక చర్యల కోసం ఆయన నేపాల్‌లో పర్యటించడం కేవలం పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని, గ్రౌండ్‌లో పనులు ప్రారంభం కాకముందే కొందరు ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ మార్కెటింగ్ చేసుకుంటున్నారంటూ ఒక జర్నలిస్ట్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే ఈ ట్రోలింగ్‌ను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోని సోనూసూద్, చాలా కూల్‌గా స్పందించారు. 'సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు దయచేసి రండి. మన ఇద్దరం కలిసి అక్కడ ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం' అంటూ సానుకూలంగా రిప్లై ఇచ్చారు. ఎలాంటి వివాదాలకు అవకాశం ఇవ్వకుండా, విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించిన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ రిప్లై సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, సోనూసూద్ సంస్కారాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

# సల్మాన్ ఖాన్.. వంశీ పైడిపల్లి చిత్రానికి పవర్‌ఫుల్ టైటిల్!



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ వైరల్ అవుతుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రానికి 'మాన్‌స్టార్' (వీశీఅర్‌వతీ) అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు బీ టౌన్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. ఒకవేళ ఇదే నిజమైతే సల్మాన్ ఖాన్ మరోసారి తన మాస్ యాక్షన్ సినిమాతో అలరించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార కథానాయికగా నటిస్తుండగా, యాక్షన్ ఎపిసోడ్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముంబై వేదికగా జరుగుతున్న ఈ చిత్ర షూటింగ్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కిస్తున్నారు. ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేలా అంతర్జాతీయ స్టంట్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. అన్ని హంగులతో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వచ్చే ఏడాది అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈద్ 2027 కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే అధికారికంగా ప్రకటించారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/